క్లుప్తంగా

డయల్‌యువర్ డీఎంకు స్పందన



వినతులను నమోదు చేసుకుంటున్న ఖేడ్ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్‌యువర్ డీఎంకు మంచి స్పందన లభించింది. ఎంపీటీసీ నందు సేట్‌తో పాటు శాంతయ్య స్వామి, రాఘవరెడ్డిలు ఖేడ్ నుంచి మోర్గి మీదుగా బీదర్‌కు బస్సు సర్వీసు నడపాలని కోరారు. కంగ్టికి నైట్‌హాల్ట్ బస్సు నడపాలని విఠల్‌రెడ్డి, శ్రీనివాస్ కోరారు. కంగ్టి, తడ్కల్, పిట్లంల మీదుగా హైదరాబాద్‌కు, ఖేడ్ నుంచి కద్పల్ మీదుగా పిట్లంకు, పుల్‌కుర్తి మీదుగా జహీరాబాద్‌కు నైట్‌హాల్ట్ బస్సును నడపాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు పేర్కొన్నారు. వచ్చిన వినతులను డీఎం నమోదు చేసుకుని త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాపు మల్‌శెట్టి



బాపు మల్‌శెట్టి

నారాయణఖేడ్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాపు మల్‌శెట్టి నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణఖేడ్ మండలం హంగిర్గా(కె) గ్రామానికి చెందిన బాపు మల్‌శెట్టి పలు పార్టీల్లో ఆయా పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గొర్రెల, మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు.

మహిళలకు రక్షణ లేదు

వైఎస్ఆర్ టీపీ నాయకుడు గట్టు రాంచంద్రరావు



మాట్లాడుతున్న గట్టు రాంచంద్రరావు

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ టీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు గట్టు రాంచంద్రరావు ఆరోపించారు. జహీరాబాద్‌లోని పస్తాపూర్‌లో మంగళవారం ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. అస్తవ్యస్త పాలన వల్ల మహిళల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఒకరికొకరు నరుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పిట్ట రాంరెడ్డి, బాబురాంశెట్టి, జోన నరేష్, సతీష్, రమేష్, దత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.


అభివృద్ధి పనులకు శ్రీకారం



సూచనలిస్తున్న పీఆర్ డిప్యూటీ ఈఈ ప్రసాద్

నారాయణఖేడ్: ర్యాకల్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్ శ్రీకారం చుట్టారు. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.34లక్షలతో సీసీ రోడ్డు, మన ఊరు..మన బడిలో భాగంగా ఉన్నతపాఠశాలలో రూ.36లక్షలతో అభివృద్ధి పనులు, పలుగుతండాలో ఉపాధిహామీ కింద రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రసాద్, ఏఈ విజయ్‌కుమార్ ఆయా పనులకు మార్కవుట్ ఇచ్చారు. ఎంఈవో విశ్వనాథ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్, సాయాగౌడ్, గొని విఠల్, అంజయ్య, పండరి తదితరులు సూచనలిచ్చారు.

జహీరాబాద్‌లో సినిమా షూటింగ్



తిరగబదరా స్వామి సినిమాలో ఓ సన్నివేశం

జహీరాబాద్ టౌన్: పస్తాపూర్ మహీంద్ర కాలనీలో వారం రోజులుగా సినిమా షూటింగ్ చేస్తున్నారు. జహీరాబాద్‌కు చెందిన సినీ నిర్మాత, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ మల్కాపురం శివకుమార్ సురక్ష ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై 'తిరగబదరా స్వామి' చిత్రం నిర్మిస్తున్నారు. హీరో రాజ్‌తరణ్, హీరోహిన్ మాల్వీలపై మహీంద్ర కాలనీలోని ఓ ఇంట్లో పలు సీన్లను చిత్రీకరించారు. ఎం.శివకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- లక్ష్యం నూరు శాతం
- మొత్తం 647 గ్రామాలు
- వసూళ్లు రూ.38.34కోట్లు
- గ్రామ అభివృద్ధికి కేటాయింపు



పసల్‌వాది గ్రామ పంచాయతీలో పన్ను కడుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా పన్నుల వసూళ్లు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక సంవత్సరం 2022–23గాను ఇంక నెల రోజులు ఉండడంతో పన్ను వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నూరు శాతం(100%) వసూళ్లే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్నారు. పన్ను వసూళ్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, నిరంతర సమీక్షలు చేస్తున్నారు. దీంతో వసూళ్ల పెరుగుతున్నాంతు. గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా పన్ను వసూళ్లు ఇలా

జిల్లాలో 647 గ్రామపంచాయతీలో ట్యాక్స్(పన్ను), నాన్ ట్యాక్స్(పన్నేతర) వసూళ్లు కలిపి రూ.38.34కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా నిర్దేశించినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు రూ.33.92 కోట్లు వసూలు అయినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. మిగిలిన పన్నులను మార్చి 31 వరకూ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. పన్ను వసూళ్లలో జిల్లాలో నాల్కల్ మొదటి స్థానంలో ఉండగా, కొండాపూర్ చివరి స్థానంలో ఉందన్నారు. పట్టణ ప్రాంతాలైన జహీరాబాద్, జిన్నారం, హత్నూర, పటాన్‌చెరు, సంగారెడ్డి, రామచంద్రాపురం మండలాల్లో నిర్దేశించిన స్థాయిలో వసూలు కాకపోవడంతో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా పన్ను వసూలు చేస్తున్నట్లు వారు వివరించారు. జిల్లావ్యాప్తంగా వసూలు చేసిన పనులతో గ్రామాల అభివృద్ధికి కేటాయించనున్నట్లు అధికారులు వివరించారు. గ్రామ పంచాయతీల ద్వారా వసూలైన పన్ను ఆదాయాన్ని పంచాయతీ జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసి, మౌలిక వసతుల కల్పన, గ్రామ అభివృద్ధికి కేటాయించనున్నారు. పల్లెల్లో పన్ను వసూళ్లు నిర్విరామంగా కొనసాగుతుందని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు.

నూరు శాతం వసూలు చేస్తాం



జిల్లాలో పన్నుల వసూళ్లు ఇప్పటికీ 88.48 పూర్తయింది. మార్చి 31 నాటికి నూరు శాతం పూర్తి చేస్తాం. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పన్ను వసూలు పెరిగింది. మండల, గ్రామ అధికారుల సహకారంతో లక్ష్యాన్ని పూర్తి చేయనున్నాం. ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లిస్తే గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో నాణ్యమైన సేవలు అందుతాయి.

– సురేశ్ మోహన్, సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి

భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి



హత్నూర(సంగారెడ్డి): వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న సీఐ వేణు కుమార్



నారాయణఖేడ్: హ్యాపీ సైన్స్‌డే ఆకారంలో గురుకుల విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని రుద్రారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. గీతం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కరుణాకర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి నగేశ్, రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీవీ నాగేంద్ర కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): సీవీ రామన్ జన్మదినం సందర్భంగా యూనైటెడ్ బుదేరా ప్రైవేటు పాఠశాల, తాటిపల్లి ఎస్‌వీఆర్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దశరథ్, మల్లేశం పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకోవడానికి సైన్స్ ఫేర్ దోహద పడుతుందని జడ్పీటీసీ సభ్యురాలు స్వప్న భాస్కర్ అన్నారు. ఎంఈఓ మారుతిరాథోడ్, సర్పంచ్ కుత్బోద్దీన్, హెచ్‌ఎం సఫియా సుల్తానా, రవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలంలోని పలు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని జోగిపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.రమేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఎ.రాంబాబు, కరస్పాండెంట్ గౌసొద్దీన్, హెచ్‌ఎం నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను చిత్రీకరించి ప్రదర్శించారు. సైన్స్‌డే ప్రాముఖ్యతను గురించి ప్రిన్సిపాల్ ఎం.ఏ ఖాదర్, తారాసింగ్ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, అస్రాసుల్తానిరాజు, పీఈటీ అజీజ్, వార్డెన్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: పట్టణంలోని శ్రీగాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. పాఠశాల హెచ్‌ఎం పోమ్యానాయక్, పాఠశాల కరస్పాండెంట్ సిద్ధారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



నారాయణఖేడ్: కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

నారాయణఖేడ్: ధరవత్ ప్రీతి ఆత్మహత్య చేసుకోవడాన్ని నిరసిస్తూ నారాయణఖేడ్‌లో వివిధ సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కిషన్ నాయక్, రాజేష్ చౌహాన్, రవీందర్‌నాయక్, నారాయణజాదవ్, దేవీసింగ్, పోమ్యానాయక్, రాంచందర్, పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబీఎస్) ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, అర్జున్‌చౌవాన్, తుకరాం చౌవాన్, దేవిసింగ్ రాథోడ్, మారుతి రాథోడ్, జైసింగ్, కిషన్, హీరాలాల్, విశ్వనాథ్, ఎరుకల సంఘం నాయకులు కిష్టయ్య, పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): ప్రీతి మృతికి శాంతి చేకూరాలని జోగిపేటలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు, జోగిపేట 20వ వార్డు కౌన్సిలర్ చందర్ నాయక్, సభ్యులు బి. శంకర్, ఎం. శంకర్, గంగారం, దేవి సింగ్, నందు, జెడి, తదితరులు పాల్గొన్నారు. జోగిపేటలో బీఎస్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జోగిపేట(అందోల్): ప్రీతి, రక్షిత మరణాలపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేశ్ డిమాండ్ చేశారు. జోగిపేటలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు అమ్మాయిలపై దాడులు, ర్యాగింగ్‌లు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రేణు కుమార్ నాయకులు జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



విరాళం అందిస్తున్న నీలం మధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో మంగళవారం శ్రీ కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపనకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ రూ.2.50లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. శ్రీ కాలభైరవ స్వామి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరారన్నారు. ఆలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రవి చారి, అశ్విన్, నర్సింగరావు, మధు చారి, కిషోర్ పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త పార్టీ కోసం పనిచేయాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతి కార్యకర్త కష్టపడి పార్టీకోసం పనిచేసినప్పుడే ఫలితం లభిస్తుందని జిన్నారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ సూచించారు. ఇమాంనగర్ గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగు రమేశ్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామాలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో గ్రామాలు పయనిస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, గుమ్మడిదల, కానుకుంట గ్రామాల్లో రూ.45లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ పాల్గొన్నారు.

పటాన్‌చెరు: దేవాలయాల నిర్మాణాలకు ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్యాసారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి రూ.10లక్షలు సాయం అందించినట్టు చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పేద ఆడపిల్లల వివాహాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్, వివిధ గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

రుద్రారం గ్రామ పరిధిలోని శ్రీ సిద్ధి గణపతి దేవాలయ ఆవరణలో అయ్యప్ప, శివుడు, ఆంజనేయ స్వామి, మాలధారణ స్వాముల కోసం రూ.50లక్షల సొంత నిధులతో చేపడుతున్న ధ్యానం మందిర స్లాబ్ నిర్మాణ పనులను మంగళవారం గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు.

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గోకుల్ నగర్, శాంతినగర్ కాలనీల్లో రూ.10లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో ఆయన శంకుస్థాపన చేశారు.

పటాన్‌చెరు: కులవృత్తుల పరిరక్షణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. టైలర్స్ డే పురస్కరించుకొని ఇంద్రేశం గ్రామంలో నీరు సింగం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సంగారెడ్డి జిల్లా మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి మాధవి, అబేదా బేగం, పద్మగౌస్, మంగలి శోభ, వడ్ల అనిత, అనిస్ బేగం, నిర్మల, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రం తనిఖీ



సఖి కేంద్రం వద్ద హనుమంతరావు, తదితరులు

సంగారెడ్డి టౌన్: న్యాయ సహాయానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీదేవిదాస్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తెల్లాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

◆ అంకితభావంతో విధులు నిర్వర్తించేవారికి గుర్తింపు

నారాయణఖేడ్: అంకితభావంతో విధులు నిర్వర్తించేవారికి ఎల్లప్పుడూ సమాజంలో గుర్తింపు ఉంటుందని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన తోట మల్లికార్జున్ ఉద్యోగ విరమణను పురస్కరించుకొని మంగళవారం డిపోలో ఏర్పాటు చేసిన సన్మానసభలో మల్లికార్జున్ దంపతులను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లిర్జున్ కండక్టర్‌గా చేరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరకు విధులు నిర్వర్తించి ఆర్టీసీకి అంకితభావంతో ఎనలేని సేవలు అందించారన్నారు. మెకానికల్ ఇంజనీర్ ధనుంజయ్, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ ప్రజా సేవే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మెగాసిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం ఉత్తమ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా అనీల్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అనీల్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా సేవ చేసే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామన్నారు.

◆ ఎల్వోసీ అందజేత

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం ఉత్తులూరుకు చెందిన పట్లోళ్ల దుర్గయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అత్యవసర చికిత్సకు గాను సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో దుర్గయ్య కుటుంబీకులకు అందజేశారు.

◆ నట్టల నివారణ మందు వేయించండి

న్యాల్‌కల్(జహీరాబాద్): నట్టల నివారణ మందు వేయించాలని పశువైద్య సిబ్బంది ఎంఏ ఘనీ పేర్కొన్నారు. చండి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్పప్ప పాల్గొన్నారు.

◆ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు కృషి చేస్తానని కార్పొరేటర్ బూరగడ్డ పుష్ప నగేశ్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పాత రామచంద్రాపురంలో భూగర్భ డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ జనార్దన్, స్థానిక నేతలు బూరుగడ్డ నగేశ్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులే ఉపాధ్యాయులుగా బోధన

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మంగళవారం ఎల్గోయి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా దీక్షితు, మండల విద్యాధికారి గా అమృత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా వినయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా అవాంతిక, ఉపాధ్యాయులుగా శైలజ, నందకిషోర్, వసంత ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నానుసింగ్, విద్యా కమిటీ చైర్మన్ మల్లేశం, ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య పాల్గొన్నారు.

◆ ఇంటి పన్నులు తగ్గించాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని మున్సిపల్ పరిధిలోని ఆయా పార్టీల నాయకులు, ప్రజలు మంగళవారం కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన పన్నుల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిలర్‌సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, జైపాల్‌రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారిని 59జీఓ కింద క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో డీడీ చెల్లించిన దరఖాస్తులను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. దశలవారిగా రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

◆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, గంగ్వార్ సర్పంచ్ జయశ్రీ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గంగ్వార్ గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని, అవసరమైన వారికి మందులు, అద్దాలను పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు.

◆ బస్సు సౌకర్యం కల్పించాలి

మునిపల్లి(అందోల్): మండలంలోని మక్తక్యాసారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల విద్యార్థులు, ప్రయాణీకులు సంబంధిత అధికారులను మంగళవారం కోరారు.

◆ ముదిరాజ్ యువత అధ్యక్షుడిగా చంద్రశేఖర్

జోగిపేట(అందోల్): ముదిరాజు సంఘం మండల యువత అధ్యక్షుడిగా గడ్డమీది చంద్రశేఖర్ ముదిరాజ్ నియమితులయ్యారు. నియామకపత్రాన్ని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడిరాజు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నారాయణ అందజేశారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జోగిపేట(అందోల్): అందోలు–జోగిపేట మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మంగళవారం రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ఖాజాపాష, మాజీ కౌఆప్షన్ సభ్యుడు అర్షత్ మోహియొద్దీన్, నాయకులు ఫారుక్, బాబా, హజ్‌గర్, సంగాగౌడ్, సుదర్శన్‌గౌడ్, రఫీక్, ఖలీల్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

◆ సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం

జహీరాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి పాలన చేస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో మూడు పోలింగ్‌బూత్‌లకు సంబంధించి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సుధీర్‌కుమార్‌లు మాట్లాడారు. బండి వెంకట్, రాజు, శ్రీనివాస్ యాదవ్, జ్యోతిమణి, శ్రీనివాస్‌గుప్తా, అనిల్ పాటిల్ పాల్గొన్నారు.

◆ ఆలయాల అభివృద్ధికి అండగా ఉంటా

పటాన్‌చెరు టౌన్: ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రూ.2.5 లక్షలు విరాళం ఇచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ..ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో క్యాసారం ఉపసర్పంచ్ విక్రమ్, బాలా గౌడ్, సత్యనారయణ, వెంకటేశ్, మల్లేష్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

